ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, గురుస్వాములు

మణికొండ: స్వామియే శరణం అయ్యప్పా అంటూ అయ్యప్ప స్వామి శరణుఘోష, భక్తి గీతాలతో మణికొండ శివాలయ ఆవరణ మారు మోగింది. సోమవారం అరుణ్ గురుస్వామి చేతుల మీదుగా అశోక్‌కుమార్ ముదిరాజ్ నిర్వహించిన తన 18వ మహా పడి పూజ ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం వరకు కొనసాగింది. నార్సింగి నర్సింగ్‌రావు భజన బృందం పాడిన అయ్యప్ప భక్తి పాటలను భక్తులను ఓలలాడించాయి. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 18వ మహా పడి నిర్వహించిన అశోక్‌ను సత్కరించారు. మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, గురుస్వాములు రాజేందర్‌గౌడ్, బి.సాయిరెడ్డి, కె.ప్రభాకర్‌రెడ్డి, రాజు, జయసింహారెడ్డి, యాలాల నరేష్, ఎం. రాఘవరెడ్డి, బి.రవికాంత్‌రెడ్డిలతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు నిత్య అన్నదానం ప్రారంభం



అప్పారెడ్డి ముఖేష్‌ను సన్మానిస్తున్న అయ్యప్ప స్వాములు

అత్తాపూర్: అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్య అన్నదాన (భిక్ష) కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. అత్తాపూర్ డివిజన్ రాంబాగ్‌లోని శ్రీ రామభక్త మహవీర్ హనుమాన్ దేవాలయంలో అయ్యప్ప స్వాముల కోసం అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 24 నుంచి జనవరి 1వ తేదీ వరకు రోజూ మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు ఈ అన్నదానం ఉంటుందని అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా అత్తాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అప్పారెడ్డి ముఖేష్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈశ్వర్ స్వామి, శేఖర్, శ్యామ్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీకేఎంయూ రాష్ట్ర సమావేశాలు విజయవంతం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బీకేఎంయూ నాయకులు

శంషాబాద్: శంషాబాద్‌లో డిసెంబర్ 7, 8వ తేదీల్లో నిర్వహించనున్న బీకేఎంయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవతం చేయాలని బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య పిలుపునిచ్చారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పేరిట వేలాది ఎకరాల వ్యవసాయ భూములను పరిశ్రమల యజమానులు, రియల్ ఎస్టేట్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. సదస్సుకు సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో నేతలు పుస్తకాల నర్సింగ్ రావు, జంగయ్య, అంజయ్య, కృష్ణ, స్వరూప, నరసింహ, సత్యం , రాములు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ నాలాపై కప్పను నిర్మించాలని వినతి



డీసీ రవికుమార్‌కు వినతిపత్రాన్నిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: దుర్గా కన్వెన్షన్ పక్క నుంచి వెళ్తున్న మురికి ఓపెన్ నాలాపై కప్పును ఏర్పాటు చేసి ప్రజలకు దారిని కల్పించాలని బస్తీవాసులు కోరారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వారు పాల్గొని డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బస్తీవాసులు మాట్లాడుతూ... దుర్గానగర్ చౌరస్తా బాలాజీ మంగళం దాబా నుంచి దుర్గా కన్వెన్షన్ వరకు రోడ్డు కల్వర్టుపైన కూడా నాలా పైకప్పును ఏర్పాటు చేశారన్నారు. అదే విధంగా దుర్గా కన్వెన్షన్ ఎదురుగా ఉన్న కాలనీలో ఈ నాలా వేస్తున్నారని... కానీ పైకప్పు వేయడం లేదన్నారు. దీంతో అక్కడి కాలనీ ప్రజలకు రహదారి లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దుర్గ కన్వెన్షన్ ఎదురుగా కాలనీ ప్రజలకు నాలాపై కప్పు వేసి కాలనీ ప్రజలకు రహదారి కల్పిస్తే ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు.

ట్రాఫిక్ కష్టాలు తీరేనా?



భారీగా ఆగిపోయిన వాహనాలు

పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- అడ్డా కూలీలతో నిత్యం తప్పని ట్రాఫిక్ జామ్
- అడ్డా మార్చినా అక్కడికి వెళ్లని కూలీలు

బండ్లగూడ: రెక్కాడితేగానీ డొక్కాడని దినసరి కూలీలు ఎంతో మంది అడ్డాల్లో పనుల కోసం ఎదురు చూస్తుంటారు. అందుకోసం కూలీలకు ప్రత్యేకంగా ఒక అడ్డా అంటూ లేకపోవడంతో ప్రధాన రహదారిపైనే వేచి ఉంటుంటారు. ఎవరు అటువైపు వచ్చినా ఏదైనా పని ఉందా అంటూ వారిని అడుగుతూ రోడ్డుపైనే పడిగాపులు కాస్తారు. అయితే వారి ఆకలి పోరాటం స్థానికంగా కొన్ని సమస్యలను ప్రధానంగా ట్రాఫిక్ సమస్యలకు దారితీస్తోంది. ఉదయం వేళల్లో జాతీయ ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంటోంది.

- బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జాతీయ ప్రధాన రహదారి హైదరాబాద్–బీజాపూర్ రోడ్డులో నిత్యం వాహనాలు పరుగులు తీస్తుంటాయి. కాళీమందిర్ చౌరస్తా నుంచి ఉదయం వేళల్లో హైదరాబాద్, చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూర్, కొడంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులకు రోడ్డుపై అడ్డా కూలీలతో తీవ్ర ఇబ్బందిగా మారుతోంది.
- ఇక్కడ పురుష కూలీలతో పాటు మహిళలు కూడా పనుల కోసం ఎదురు చూస్తుంటారు. ఎక్కువ సంఖ్యలోనే పనికోసం రోడ్డు మీద ఎదురు చూస్తున్న క్రమంలో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పాడి పలు ప్రమాదాలకు దారి తీస్తుంది. ప్రయాణికుల సమయం కూడా వృథా అవుతోంది.

భారీగా పెరిగిన నిర్మాణాలు...

ఒకప్పటితో పోలిస్తే బండ్లగూడ జాగీర్‌లో రోజురోజుకూ నిర్మాణాలు భారీగానే పెరిగాయి. అదే రీతిలో దినసరి కూలీలు కూడ కాళీమందిర్ ప్రాంతంలో పెరిగిపోతున్నారు. భవన నిర్మాణ కార్మికులతో పాటు దినసరి పనులు చేసే అనేక మంది కూలీలకు ప్రత్యేకంగా లేబర్ అడ్డా కేటాయించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

దీంతో కూలీలు దీన్నే అడ్డాగా భావిస్తూ నిత్యం ఉదయాన్నే రోడ్డుపైకి వచ్చి నిలుచుంటున్నారు. ఈ కారణంగా స్థానికంగా వాహనాల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- ఆ రోడ్డు గుండా రోజు స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులకు ట్రాఫిక్ జామ్ కారణంగా చాలా ఆలస్యం అవుతోంది. వాహనాలు నిలిచిపోవడంతో రోడ్లపై తీవ్ర ఇబ్బందులు పడవలసిన పరిస్థితి నేలకొంటుందని, ట్రాఫిక్ పోలీసులు ఈ పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు.



కాళీమందిర్ చౌరస్తాలో రోడ్డుపైనే అడ్డా కూలీలు

అడ్డా మార్చినా ఫలితం శూన్యం...

నార్సింగి ట్రాఫిక్ పోలీస్ అధికారులు గతంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రోడ్డుపైన కూలీలు నిలవకుండా వారితో మాట్లాడి లేబర్ అడ్డాను రోడ్డు పక్కల ఉన్న బ్రాడ్‌వే ఏరియాలోకి అడ్డాను మార్చారు. కూలీలు రోడ్డు దాటేందుకు వీలుగా అక్కడ సెల్ ఫోన్ సిగ్నల్ కూడా ఏర్పాటు చేశారు. కానీ కూలీలు ఆ ప్రాంతంలోకి వెళ్లడంలేదు. ప్రస్తుతం అక్కడ సెల్‌ఫోన్ సిగ్నల్ కూడా పని చేయడం లేదు. ట్రాఫిక్ సిబ్బంది పట్టించుకోని గతంలో అడ్డా కూలీలకు ఏర్పాటు చేసిన బ్రాడ్‌వే ఏరియాలో కూలీలు ఉండేలా తగు చర్యలు చేపట్టవలసిందిగా ప్రయాణికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: ఫీడర్‌ల పరిధిలో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున మంగళవారం పలు ఫీడర్‌ల పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ సంతోష్ కుమార్ తెలిపారు. పంచవటి కాలనీ, భాగ్యలక్ష్మి కాలనీ, హుడాకాలనీ, లాలమ్మ గార్డన్, ఫ్రెండ్స్ కాలనీ, సెక్రటేరియట్ కాలనీ, తానీషా హిల్స్, డాలర్ హిల్స్, హనుమాన్‌నగర్ కాలనీ, ఫ్లైజెంట్ వ్యాలీ కాలనీ, శివపురి కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీలలో విద్యుత్ ఉండదన్నారు.

తాగునీటి వృథా పట్టదా?



అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ రాంబాగ్ చిన్న అనంతగిరి దేవాలయం ప్రాంతంలో రెండు రోజులుగా తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతున్నారు. పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు రోజులుగా రెండు కిలోమీటర్ల మేర మంచినీరు రోడ్డుపై వృథాగా పోతోందన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



హాజరైన సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

సర్వేపై సమీక్ష.. వివరాలివ్వని వారిపై చర్చ!

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాళీమందిర్ వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సూపర్‌వైజర్ ఆఫీసర్స్, ఎన్యుమరేటర్లతో నిర్వహించిన సమావేశానికి కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర హాజరయ్యారు. ఎన్యుమరేటర్లు హౌస్ లిస్టింగ్ చేసిన కుటుంబాల సంఖ్య, పూర్తి చేసిన కుటుంబాల సంఖ్య, వివిధ కారణాల వల్ల ఎన్యుమరేషన్‌కు సంబంధించిన సమాచారం ఇవ్వడానికి నిరాకరించిన కుటుంబాల యజమానుల వివరాలపై చర్చించారు. ఎన్యుమరేషన్ చేసిన ఫారంలను సూపర్‌వైజర్ ఆఫీసర్లు ధ్రువీకరించి దగ్గరుంచి డేటా ఎంట్రీ చేయించాలని తెలిపారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, మేనేజర్ ఇ.మంజులత, సూపర్‌వైజర్ ఆఫీసర్స్, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాలు నమోదు చేసుకోవాలి...

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సర్వే వివరాలు నమోదు చేసుకోని వారు మంగళవారం ఇంటి వద్దకు వచ్చే ఎన్యుమరేటర్లకు చెప్పి వివరాలు నమోదు చేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా మంగళవారం కూడా ఎన్యుమటర్లే తమ కుటుంబ వివరాలను సేకరిస్తారన్నారు. ఇంటి వద్దకు వచ్చే ఎన్యుమరేటర్లు, లేదా కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్: 79812 35771, 85004 49269 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి వివరాలు సమర్పించాలని సూచించారు.

ప్రజలకు ఇబ్బందులు కలగజేస్తే సహించబోం

ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్



భూములు, ఇళ్లకు సంబంధించిన డ్రాఫ్ట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తహసీల్దార్ అనితరెడ్డి

గోల్కొండ: అకారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగజేస్తే సహించబోమని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన షేక్‌పేట్ తహసీల్దార్ అనితారెడ్డితో కలిసి మజీద్ ఉమర్ ఫారూఖ్ హకీంపేట్ ప్రభుత్వ పాఠశాల తదితర ప్రాంతాల్లో పర్యటించారు. హెచ్‌ఎండీఏ వారు ఈ ప్రాంతంలో సరిహద్దులు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని దీన్ని వల్ల స్థానికులు నష్టపోయే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే అన్నారు. హెచ్‌ఎండీఏ అధికారులను ఈ ప్రాంతంలోకి సర్వే చేయనివ్వమని స్థానికులకు ఇబ్బందులు పెట్టే ఏ పనైనా సరే తాము అడ్డుకుంటామన్నారు. సరిహద్దులు నిర్ధారించడంలో పేదలు వారి ఇళ్లు కోల్పోయే ప్రమాదం ఉందని ఇది తమకు ఏ మాత్రం ఆమోదయోగం కాదని ఆయన అన్నారు. హెచ్‌ఎండీఏ హకీంపేట్‌కు వస్తుందన్న విషయం తెలియగానే స్థానికులు తన వద్దకు వచ్చి ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. సరిహద్దులు బిగించే క్రమంలో తమ ఇళ్లు కోల్పోతామేమో అని అందరూ ఆందోళన చెందుతున్నారన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్, షేక్‌పేట్ మండల కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు. అనంతరం ఆయన నగరంలో జరిగిన బీసీల సమరభేరికి తరలివెళ్లారు. బీసీలకు తమ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని ఆయన అన్నారు.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

మణికొండ: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాలలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని తుల్జారాం దేవాలయం ఆవరణలో సోమవారం కనుల పండుగగా శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. వేద పండితుల కల్యాణం ఇతివృత్తాలను వివరిస్తూ నిర్వహించారు. కార్తీకమాసం శివ కేశవులను కొలిస్తే మన పాపాలు పోవటంతో పాటు ఎంతో పుణ్యం వస్తుందన్నారు. కల్యాణోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. మణికొండ పార్వతీ రామలింగేశ్వరస్వామి, పుప్పాలగూడ కాశీ విశ్వేశ్వరాలయం, మంచిరేవుల మచిలేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

డిసెంబర్ 6 నుంచి బాలోత్సవం పేరిట పోటీలు

గచ్చిబౌలి: విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు డిసెంబర్ 6,7 తేదీల్లో బాలోత్సవం పేరిట వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు ప్లానిటరీ సొసైటీ డైరెక్టర్ రఘునందన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బాలల జాతర ఉంటుందన్నారు. వివిధ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్, డ్రాయింగ్, ఫోక్ గ్రూప్ డ్యాన్స్, సాంగ్స్, సోలో సింగింగ్, డ్రామా స్కిట్ తదితర పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులు ఆర్.సాంబశివరావు, బాలోత్సవం కన్వీనర్ విజయ్ కుమార్, సభ్యులు రవీందర్, కుర్ర అనిల్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో సత్తాచాటిన చిన్నారులు

గోల్కొండ: పిల్లలను వారికి ఇష్టమైన క్రీడల్లో చిన్నతనం నుంచే శిక్షణ ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి సలహాదారు బి.సాయిబాబాచారి అన్నారు. స్విమ్మింగ్ కోచ్ వినోద్ ఆధ్వర్యంలో ఓర్కా ఈత పోటీలు సోమవారం ముగిశాయి. అర్చన, రాకేష్, నేహా విజేతలుగా నిలవగా బి.సాయిబాబాచారి వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.



విజేతలతో సాయిబాబాచారి

హెచ్‌సీయూ విద్యార్థికి అరుదైన అవకాశం



బాలకృష్ణ

రాయదుర్గం: తెలంగాణకు చెందిన హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థికి అరుదైన అవకాశం లభించింది. నల్గొండ జిల్లా చింతపట్టి మండలంలోని బద్దమవరిగూడెం గ్రామానికి చెందిన కసుకాటి బాలకృష్ణ ఉత్తరప్రదేశ్‌లోని ఖరగ్‌పూర్‌లో నిర్వహించిన జాతీయ సమావేశాల్లో ఏబీవీపీ కేంద్ర విశ్వవిద్యాలయాల కార్యాలయాల జాతీయ కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. బాలకృష్ణ ప్రస్తుతం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో జర్నలిజంలో పీహెచ్‌డీ (పరిశోధక విద్యార్థి)గా చేస్తూ హెచ్‌సీయూ ఏబీవీపీ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సెంట్రల్ యూనివర్శిటీల్లో ఏబీవీపీ కార్యకలాపాలను సమన్వయం చేసే అవకాశం లభించడం అనందంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా సెంట్రల్ యూనివర్శిటీల జాతీయ కన్వీనర్‌గా బాలకృష్ణకు అవకాశం రావడంపై హెచ్‌సీయూ ఏబీవీపీ నాయకులు ఆయనను అభినందించారు. జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు వచ్చేలా పనిచేయాలని వారు ఆకాంక్షించారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

చార్మినార్: ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న అన్నారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో సోమవారం నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ప్రజావాణిలో చాంద్రాయణగుట్ట బండ్లగూడ ప్రాంతంలో వీధి దీపం సమస్యపై ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ మహేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనా బి, మలేరియా విభాగం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామల శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సీపీ ఎంఏ మాజీద్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో పాల్గొన్న జోనల్ కమిషనర్ తదితరులు

ప్రమాదకర ప్రాంతాల పరిశీలన





కూడళ్లలో పర్యటిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్

రాజేంద్రనగర్: వాహనదారులు ట్రాఫిక్ నియమనిబంధనలను కచ్చితంగా పాటించాలని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ ఎ.బాలాజీ సూచించారు. సోమవారం ఆయన రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, సిబ్బందితో కలిసి దుర్గానగర్, పల్లె చెరువు వద్ద ప్రమాదాలు జరిగే ప్రాంతాలను సందర్శించి ప్రమాదాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలను నివారించడానికి, ట్రాఫిక్ నిర్వాహణను మెరుగు పరచడానికి తగిన సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం ఆరాంఘర్ ప్రాంతంలో పర్యటించి రాజేంద్రనగర్ ఆర్టీసీ డీఎం కలిసి బస్టాపులను పరిశీలించి వాటిని అనువైన ప్రాంతాలకు మార్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.